Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

జాతీయ తెలుగు దినపత్రిక

APTEL:2024/86143

WANTED

స్టాఫ్ రిపోర్టర్లు కావలెను

చిత్తూరు ఎక్స్‌ప్రెస్ దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో రిపోర్టర్లు, జిల్లా కేంద్రాలలో స్టాఫ్ రిపోర్టర్లు కావలెను

ఆయా విభాగాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు రాయగల సామర్థ్యం ఉండాలి. అనుభవం,అర్హతను బట్టి ప్రాధాన్యత ఇవ్వబడును

సంప్రదించండి సెల్ : 9440815774

Associate Editor : K L Krishnam Raju | Volume : 6 | issue: 157 | Sunday : 01.06.2025 | Price : 3/- | Pages : 4

అసోషియేట్ ఎడిటర్ : కే ఎల్ కృష్ణం రాజు | సంపుటి : 6 | సంచిక :157 | ఆదివారం : 01.06.2025 | వెల : 3 | పేజీలు : 4



# మాది పేదల ప్రభుత్వం

- పెన్షన్‌పై సీఎం చంద్రబాబు కీలక ప్రకటన
- పేదవాడికి సహాయం చేస్తే వచ్చే సంతోషం ఏ పనిలోనూ ఉండదు
- పింఛన్లు ప్రతి నెలా ఒకటో తేదీనే ఇంటింటికి వెళ్లి అందిస్తున్నాం
- "ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి రాగానే పింఛను మొత్తాన్ని పెంచాం
- పేదవాడి కోసం పింఛన్ల కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది ఎన్టీఆర్.
- వెనుకబడిన వర్గాలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుంది
- బీసీల అభ్యున్నతి కోసం నిరంతరం పని చేస్తున్నాం
- బీసీలకు సోలార్ ద్వారా ఉచితంగా ఇళ్లకు కరెంట్ ఇస్తాం.

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, కోనసీమ**

పేదవాడికి సహాయం చేస్తే వచ్చే సంతోషం ఏ పనిలోనూ ఉండదని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. పింఛన్లు ప్రతి నెలా ఒకటో తేదీనే ఇంటింటికి వెళ్లి అందిస్తున్నామని తెలిపారు. లబ్ధిదారులు ఎక్కడ ఉంటే అక్కడికి వెళ్లి అందించేలా చర్యలు చేపట్టామన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా చెయ్యేరులో సీఎం పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం నిర్వహించిన ప్రజావేదిక సభలో ఆయన మాట్లాడారు.

జిల్లాలోని చెయ్యేరులో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటన కొనసాగుతోంది. కాట్రేనికోన మండలం చెయ్యేరులో లబ్ధిదారులకు సీఎం పెన్షన్లను పంపిణీ చేశారు. అనంతరం ప్రజావేదిక సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఒక రోజు ముందుగానే రాష్ట్రంలో పెన్షన్లు పంపిణీ చేశామని.. ఉపాధి కూలీలకు పని ప్రదేశాల్లోనే పెన్షన్లు ఇస్తున్నామని అన్నారు. ఇదీ.. పేదల కోసం ప్రభుత్వం పనిచేసే తీరు అని చెప్పుకొచ్చారు. హామీ ఇచ్చిన ప్రకారం అధికారంలోకి రాగానే పెన్షన్లను రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెంచామని అన్నారు. 64 లక్షల మందికి ప్రతినెల 1వ తేదీనే పెన్షన్లు అందిస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే 90 శాతం పెన్షన్ల పంపిణీ పూర్తి అయినట్లు వెల్లడించారు. ఏడాదిలోనే కూటమి ప్రభుత్వం పేదలకు కనీవినీ ఎరుగని రీతిలో సహాయం చేసిందన్నారు. రూ.34 వేల కోట్లు పింఛన్ల కోసం ఇచ్చామని తెలిపారు. దేశంలో ఎక్కడా తమ ప్రభుత్వం ఇచ్చినట్లు పెన్షన్లు ఇవ్వడం లేదని అన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు పేదల కోసం ఆలోచించాలన్నారు. భగవంతుడు కనికరిస్తే భవిష్యత్తులో పింఛన్లు పెంచుతామని ప్రకటించారు. గత వైసీపీ ప్రభుత్వం వితంతు పింఛన్లు ఇవ్వలేదని.. తాము వచ్చాక 71,380 మందికి - మిగతా3లో



## టెన్త్ పరీక్షల నిర్వహణలో తండ్రీ, కొడుకు ఫెయిల్

వారి అనాలోచిత నిర్ణయాలతో విద్యార్థులకు తీవ్ర నష్టాలు

ట్విట్టర్‌లో వైయస్ఆర్‌సీపీ అధినేత వైయస్ జగన్ మోహన్ రెడ్డి ధ్వజం

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

టెన్త్ పరీక్షల నిర్వహణలో తండ్రీ, కొడుకులు చంద్రబాబు, లోకేష్ పూర్తిగా ఫెయిల్ అయ్యారని వైయస్ఆర్‌సీపీ అధినేత వైయస్ జగన్ మోహన్‌రెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. వారి అవివేక, అనాలోచిత, పరిణితిలేని నిర్ణయాలతో విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు కష్టాలు ఎదురవుతున్నాయన్నారు. పదో తరగతి మూల్యాంకనంలో జరిగిన తప్పులను వైయస్ జగన్ ట్విట్టర్ వేదికగా తూర్పారబట్టారు. జగన్ ఏమన్నారంటే.. చంద్రబాబు గారూ.. మీరు, మీ కొడుకు విద్యాశాఖ మంత్రి లోకేష్ టెన్త్ పరీక్షల నిర్వహణలో పూర్తిగా ఫెయిల్ అయ్యారు. మీ పాలనలో విద్యారంగం భ్రష్టుపట్టిపోయింది. - మిగతా3లో

## దేశంలో కోవిడ్ కలకలం



- 3,395కు చేరిన యాక్టివ్ కేసులు
- గత 24 గంటల్లో కోవిడ్‌తో నలుగురు మృతి
- యూపీ, ఢిల్లీ, కర్ణాటక కేరళలో ఒక్కొక్కరు మృతి
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో కరోనా కలకలం



పాక్ చైనాపై ఆధారపడితే..

## భారత్ సొంతంగా నిలదొక్కుకుంది

- ఆపరేషన్ సిందూర్‌లో భారత్‌లో బలోపేతం చేసిన వ్యవస్థలనే ఉపయోగించాం
- 'పాకిస్థాన్ సొంత రక్షణవ్యవస్థలు బలంగా లేకపోవడంతో చైనాపై ఆధారపడింది
- స్పేస్, శాటిలైట్ ఇంటెలిజెన్స్ అందరికీ అందుబాటులో ఉంది.
- ఆ సమయంలో చైనా లేదా విదేశీ శాటిలైట్ చిత్రాలపై దాయాది దేశం ఆధారపడింది


## అద్భుతమైన 'ఆపరేషన్' నిర్వహించారు

- తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- రాపెల్ యుద్ధ విమానం కూలిపోయిందని సిడిఎస్ అనిల్ చౌహన్ మాత్రం స్పష్టం చేశారు
- ఇక కాల్పుల విరమణ అంశానికి సంబంధించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎలా ట్వీట్ చేస్తారు
- ఫైటర్ విమానాలు, ఆయుధాల సప్లయ్ ఆలస్యం అవుతున్నాయి
- ఎయిర్ చీఫ్ మార్షల్ చెప్పడం ఆందోళన కల్గిస్తోంది



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, ఢిల్లీ**

పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధంలో రాఫెల్ యుద్ధ విమానాలు ఏమైనా కూలిపోయాయా? అని తాము అడిగిన ప్రశ్నకు విదేశాంగ శాఖ మంత్రి సరైన సమాధానం చెప్పలేదని తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. ఆపరేషన్ సిందూర్ రాపెల్ యుద్ధ విమానం కూలిపోయిందని సిడిఎస్ అనిల్ చౌహన్ మాత్రం స్పష్టం చేశారని, దీనిపై కేంద్ర ప్రభుత్వం వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు ఉత్తమ్‌కుమార్ రెడ్డి. ఇకనైనా భారత్ ప్రభుత్వం దీన్ని నిరాకరించడం మానుకోవాలనారు. 'ఇదే విషయాన్ని రాహుల్ గాంధీ మొదటి నుంచి అడుగుతున్నారని ఈ సందర్భంగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఇక కాల్పుల విరమణ అంశానికి సంబంధించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎలా ట్వీట్ చేస్తారని ప్రశ్నించారు. ఆపరేషన్ సిందూర్‌తో - మిగతా3లో



## జాతీయ వీరత్వానికి చిహ్నంగా సింధూరం

- ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు
- ఆపరేషన్ సిందూర్‌ను ఉదహరిస్తూ ఇది భారతీయ మహిళల ధైర్యం, శక్తి, సంకల్పాన్ని ప్రతిబింబిస్తోంది
- దేవుని ఆరాధన, ప్రజల సేవకు దేవి అహల్యాబాయి ఎలాంటి భేదం చూపలేదు
- కాశీలో సేవ చేసే అవకాశం నాకు లభించడం సంతోషకరం

## సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికైనా 'జై తెలంగాణ' అనాలి

- కేసీఆర్‌కు ఒక కన్ను భారాస .. రెండో కన్ను జాగృతి సంస్థ
- తెలంగాణ ప్రజల గొంతుకగా తెలంగాణ జాగృతి సంస్థ పనిచేసింది
- భారాస ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత
- గత పదేళ్ల కేసీఆర్ పాలనకు.. ఇప్పటి కాంగ్రెస్ పాలనకు ఎంతో తేడా ఉంది
- జూన్ 2న రాజీవ్ యువ వికాసం పథకం ఎందుకు తెస్తున్నారు
- రాజీవ్ గాంధీకి తెలంగాణకు ఏం సంబంధం.



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్**

తెలంగాణ ప్రజల గొంతుకగా తెలంగాణ జాగృతి సంస్థ పనిచేసిందని భారాస ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. బంజారాహిల్స్‌లో ఏర్పాటు చేసిన 'తెలంగాణ జాగృతి' నూతన కార్యాలయాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. "కేసీఆర్, ఆచార్య జయశంకర్ స్ఫూర్తితో జాగృతి సంస్థ ఏర్పడింది. ఈ సంస్థను ప్రారంభించి 18ఏళ్లు అయింది. ఇప్పటి వరకు అశోక్‌నగర్‌లో జాగృతి కార్యాలయం ఉండేది.. ఇప్పుడు బంజారాహిల్స్‌కు మార్చాం. ఇకపై ఇక్కడి నుంచే సంస్థ కార్యకలాపాలు కొనసాగిస్తాం. ఇన్నేళ్ల ప్రయాణంలో ఎందరో ఆశీస్సులు అందించారు. మేము చేసిన ఉద్యమాల వల్ల చాలా జీవోలు వచ్చాయి. గత పదేళ్ల కేసీఆర్ పాలనకు.. ఇప్పటి కాంగ్రెస్ పాలనకు ఎంతో తేడా ఉంది. సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికైనా 'జై తెలంగాణ' అనాలి. అమరవీరులకు నివాళులు అర్పించాలి. కనీసం రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజైనా రేవంత్‌రెడ్డి.. 'జై తెలంగాణ' అనాలి. - మిగతా3లో



## మంత్రి ఉత్తమ్ కాళేశ్వరంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు

- కాళేశ్వరంతో ఒక ఎకరం పారలేదని కాంగ్రెస్ నేతలు అంటున్నారు
- కాళేశ్వరం ప్రాజెక్ట్ గురించి అన్ని విషయాలు ప్రజలకు తెలుసు
- ఈ ప్రాజెక్ట్‌తో ఉపయోగం లేదని అన్నోళ్లకి ఈ ఏడాది పండిన పంట తెలియదా
- మా పార్టీ నుంచి వెళ్లిన నేతలను వ్యక్తిగతంగా ఎప్పుడూ కలవలేదు: హరీశ్‌రావు

## ఎన్టీఆర్ భరోసాపింఛన్ల పంపిణీలో డాక్టర్ సురేష్ బాబు



**కుప్పం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, మే 31:**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎన్టీఆర్ భరోసాపెన్షన్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా శనివారం 31తేదిన కుప్పం మునిసిపాలిటీ పరిధిలోని మర్రిమాను వీధిలో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో టిడిపి పార్టీ ఆర్గనైజర్ సెక్రెటరీ టిడిపి విస్తరణ కమిటీ కన్వీనర్ డాక్టర్ బి.ఆర్ సురేష్ బాబు, నాయకులతో కలిసి, ఒక్కరోజు ముందుగానే ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సంధర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపు ఆదివారం సెలవు కావడంతో ఒక్క రోజు ముందుగానే సామాజిక పింఛన్ల పంపిణీ చేపట్టాలని బృహత్తర కార్యక్రమం చేపట్టి లబ్ధిదారులకు బాసటగా నిలిచారని పేర్కొన్నారు.

## నేటి నుంచి కుప్పం సబ్ డివిజన్‌లో ఆంక్షలు

### డీఎస్పీ పార్థసారధి



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,మే 31:**

కుప్పంనియోజకవర్గం సబ్ డివిజన్ పరిధిలో జూన్ 1నుంచి 30వ తేదీ వరకు సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలు చేస్తున్నట్లు డి.ఎస్.పి పార్థసారథి పేర్కొన్నారు. శాంతి భద్రతలరీత్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలియ జేశారు.కుప్పం అర్బన్, గుడుపల్లె, శాంతిపురం, రామకుప్పం పిఎస్ పరిసర పరిధిలో అనుమతులు లేకుండా ఎలాంటి సభలు, సమావేశాలు, ఊరేగింపులు, ర్యాలీలు నిర్వహించకూడదని తెలిపారు. నిబంధనలు మీరితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని డి.ఎస్.పి పార్థసారథి హెచ్చరించారు.

### ద్రావిడ విశ్వ విద్యాలయంలో తమిళ సాహిత్య పుస్తకాన్ని

## ఆవిష్కరించిన వీసీ ఎం.దొరస్వామి



**గుడిపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్,మే 31:**

కుప్పం నియోజకవర్గం గుడిపల్లి మండలంలోని ద్రావిడ విశ్వవిద్యాలయ తమిళ భాష, అనువాద అధ్యయన విభాగ ఆచార్యులు గణేష్ మూర్తి పర్యవేక్షణలో ఎం.ఏ పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు తమిళ సాహిత్యం పై ప్రాజెక్టును పూర్తి చేశారు. వీరు అధ్యయనం రంగం అనే అంశంపై పూర్తి చేసిన ప్రాజెక్టును చెన్నై సుబ్బు రెడియార్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ పుస్తకముగా ప్రచురించారు. ఈ పుస్తకాన్ని ద్రావిడ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎం.దొరస్వామి రిజిస్ట్రార్ వి.కిరణ్ కుమార్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్ మాధవ నాయుడు డీన్ ఆచార్య శివకుమార్ తమిళ్ శాఖ అధ్యక్షులు ఆచార్య విష్ణు కుమార్ పర్యవేక్షకులు సుబ్బు రెడ్డి ఆర్ ట్రస్ట్, చెన్నై, ప్రెసిడెంట్ ఆచార్య రామలింగం పాల్గొన్నారు.

## వైసిపి పాలనలోనే హత్య రాజకీయాలు

**గంగాధర్ నెల్లూరు,చిత్తూరు ఎక్స్ ప్రెస్,మే 31:**

వైసీపీ పాలనలోనే హత్య రాజకీయాలు దోపిడీలు దోచుకోవడాలు దౌర్జన్యాలు జరిగాయి అని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే డాక్టర్ థామస్ అన్నారు శనివారం. గంగాధర్ నెల్లూరు మండలం ఎస్ ఎస్ కొండలో వింజంపంచాయతీలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమం పాడి రైతుల సబ్సిడీ దాన పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ థామస్ పాల్గొన్నారు. ఈ సందర్భం గాఎమ్మెల్యే డాక్టర్ థామస్ మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో హత్య ,దోపిడీ, రౌడీయిజం రాజకీయం చేశారు. వైసిపి పాలనలో ఎస్సీలను చంపి డోర్ డెలివరీ చేశారు.ఇలా చేయడాన్ని వెన్నుపోటు రాజకీయమంటారా? అభివృద్ధి చేస్తున్న తెలుగుదేశం పార్టీని వెన్నుపోటు రాజకీ యమంటారా భూ కబ్జాలు చేసింది. మీరే కదా గంజాయి అమ్మింది, మీరే కదా భూ కబ్జాలు పాల్పడింది. మీరే కదా అని ఘాటుగా ఎమ్మెల్యే డాక్టర్ థామస్ విమ ర్శించారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు స్వామి దాసు యాదవ సాధికార సమితి జిల్లా అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్ కృష్ణం నాయుడు మాజీ మండల అధ్యక్షుడు దేవ సుందరం సగి కుమార్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### ఏ.పీ.ఎస్.ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం ఆధ్వర్యంలో

## ముందస్తు ఎన్టీఆర్ భరోసాపింఛన్ల పంపిణి పండుగ కార్యక్రమం

**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, మే 31:**





రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎన్టీఆర్ భరోసాపెన్షన్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా శనివారం 31తేదిన కుప్పం మునిసిపాలిటీ కొత్తపేట 13,14,15, వార్డులో లబ్ధిదారులకి పండగ వాతావరణంలో ఒక్కరోజు ముందుగానే ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణి కార్యక్రమంలో పాల్గొన్న ఏ.పీ.ఎస్.ఆర్టీసీ.వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం, ఈ సంధర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపు ఆదివారం సెలవు కావడంతో ఒక్క రోజు ముందుగానే సామాజిక పింఛన్ల పంపిణీ చేపట్టాలని బృహత్తర కార్యక్రమం చేపట్టి లబ్ధిదారులకు బాసటగా నిలిచారని పేర్కొన్నారు.ఈ కార్యక్ర మంలో తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి గోపీనాథ్, క్లస్టర్ ఇంచార్జ్ సత్యేంద్ర శేఖర్, యూనిట్ ఇంచార్జ్ (అప్పు) ముఖేష్, మైనార్టీ నాయకులు అన్సర్ భాష, మాజీ ఎంపీటీసీ వరదరాజులు మాజీ వార్డు నెంబర్ జయలక్ష్మి వార్డు పార్టీ అధ్యక్షులు, సుకుమార్ మురళి,లోకేష్,మహేంద్ర సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బాల మరియు కౌమార కార్మిక వ్యవస్థ నిషేధ మరియు నియంత్రణ చట్టం – 1986 (సవరణ చట్టం 2016 )ను పకడ్బందీగా అమలుకు చర్యలు







**ఈ చట్టాలను సమర్థ వంతంగా అమలు చేయుటలో కార్మికశాఖ పోలీసు, రెవెన్యూ శాఖల సహకారంతో ముందుకు వెళ్లాలి.**

**బాల కార్మికుల గురించి ఫిర్యాదు కై చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ :1098 మరియు 9492555216 ను సంప్రదించవచ్చు**

**జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్**

**చిత్తూరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్,మే 31:**

బాల,కౌమార కార్మిక వ్యవస్థ (నిషేధ, నియంత్రణ) చట్టం – 1986,(సవరణచట్టం 2016 )ను పగడ్బందీగా అమలుకు చర్యలు చేపట్టాలని జిల్లాకలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన బాల, కౌమార కార్మిక వ్యవస్థ నిషేధ మరియు నియంత్రణ చట్టం–(1986 సవరణ చట్టం –2016) సమర్థ వంతంగా అమలుకు సంబంధించి సంబంధిత శాఖల అధికారులు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధుల తో సమావేశం కార్మికశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..బాల, కౌమార కార్మిక వ్యవస్థ చట్టం– 1986 (సవరణ చట్టం 2016) మేరకు సెక్షన్ 3 కింద ఏ వృత్తిలో అయినా, ఏ ప్రక్రియలో అయినా 14 సంవత్సరాలలోపు బాల బాలి కలచే పనిచేయించుకోవడం లేదా పనిలోకి అనుమతించడం పూర్తిగా నిషేధంఅన్నారు. సెక్షన్ 3 ఎ కింద 14 సంవత్సరాల వయసు నిండిన 18 సంవత్సరాల వయస్సు పూర్తి కాని కౌమార వయస్సులో ఉన్న వారి చేత నిర్దేశిత ఏ,బి షెడ్యూల్లో పేర్కొన్న నిషేధిత ప్రమాద కర వృత్తులు, ప్రక్రియలో పని చేయించుకోవడంలేక పని లోకి అనుమ తించడం పూర్తిగా నిషేధించడం అయినదని, ఈ సెక్షన్లలను ఉల్లంఘించిన వారికి ఆరు నెలల నుండి రెండు సంవత్సరాల వరకు జైలు శిక్ష మరియు 20 వేల నుండి 50 వేల వరకు జరిమానా విధించబడు తుందని లేదా శిక్ష మరియు జరిమానా రెండు కూడా విధించ బడతాయని చట్టంలో పేర్కొనడం జరిగిందన్నారు. బాల కార్మికుల గురించి ఏదైనా ఫిర్యాదుకై చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్1098, 9492555216ని సంప్రదించవచ్చునన్నారు. ఈ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయడంలో డివిజన్ స్థాయిలో పోలీసు, రెవిన్యూశాఖలను సమన్వయంచేసుకొని కార్మికవ్యవస్థ ముందుకు వెళ్లడంద్వారా సత్ఫలితాలు ఉంటాయని తెలిపారు. కార్మిక శాఖమండల స్థాయిలో పోలీసు, రెవెన్యూ సంబంధిత శాఖలను సమన్వయంచేసుకొనితనిఖీలు నిర్వహణ చేపట్టడం ద్వారా ఇటుక బట్టీలు, మైనింగ్ పరిశ్రమల వద్ద ఫుడ్ ప్రాసెసింగ్ కంపెనీల వద్ద, డైరీ పరిశ్రమలలో ఉన్న బాల కార్మికులను గుర్తించేందుకు అవకాశాలు ఉంటాయన్నారు.ఈ దిశగా పనిచేయాలన్నారు. బడి బయటి పిల్లలను గుర్తించడంతో పాటు వారిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడమే కాకుండా క్రమం తప్పకుండా పాఠశాలలకు వచ్చేలా చొరవ విద్యాశాఖ అధికారులు చొరవ చూపాలన్నారు.ఈ సమావేశంలో భాగంగా కార్మిక శాఖచే బాల కార్మిక వ్యవస్థ నిషేధ చట్టం నకు సంబంధించిన మరియు బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమనినకు సంబంధించిన అవగాహన గోడ పత్రికలను జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులు ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా కార్మిక శాఖ అధికారి ఓంకార్, సమగ్ర శిక్ష ఏపిసి వెంకటరమణ సాంఘిక సంక్షేమశాఖ అధికారి చెన్నయ్య, జిల్లా స్త్రీశిశు సంక్షేమశాఖ అధికారి వెంకటే శ్వరి,రియల్ ఎడ్యుకేషన్, లిటరసీ స్వచ్ఛం దసంస్థ ప్రతినిధులు రామారావు, తదితరులు పాల్గొన్నారు.

## మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో అవసరం

### సీజన్ 2 క్రికెట్ టీం విజేతగా పాపిరెడ్డిపల్లి



**ఎస్ఆర్ పురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, మే 31:**

మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో అవసరమని ఉపాధ్యాయుడు పూజాలి అన్నారు. ఎస్ఆర్ పురం మండలం పెద్ద తయ్యూరు క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. శనివారం క్రికెట్ ఫైనల్ మ్యాచ్‌లో పాపిరెడ్డిపల్లి పెద్ద తయ్యూరు జట్లు పోటీపడ్డాయి, పాపిరెడ్డిపల్లి టీం విజయం సాధించింది. పాపి రెడ్డి పల్లి టీం విజయం సాధించడంతో 50 వేల రూపాయల నగదుతో పాటు బహుమతిని అందుకున్నారు. అలాగే రన్నర్‌గా నిలిచిన పెద్ద తయ్యూరు 25 వేల రూపాయలు నగదుతో పాటు బహుమతిని ప్రధానం చేసుకున్నారు. పాపిరెడ్డిపల్లి క్రికెట్ టీం కెప్టెన్ శశికుమార్ కిరణ్ మురళి సుమన్,పవన్ కళ్యాణ్ శేషు విజయ్ డ్యానీ మహేష్ సుధాకర్ ధనుష్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## పేదల అభివృద్ధి తెలుగుదేశం పార్టీ లక్ష్యం..

## మాజీ సర్పంచ్ భూపతిరెడ్డి

**ఎస్ఆర్ పురం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, మే 31:**



పేదల అభివృద్ధి తెలుగుదేశం పార్టీ లక్ష్యమని మంగుంట మాజీ సర్పంచ్ భూపతిరెడ్డి అన్నారు. శనివారం మంగుంట పంచాయతీలో మాజీ సర్పంచ్ భూపతిరెడ్డి టిడిపి యువ నాయకుడు ఆనంద రెడ్డి వృద్ధులకు వితంతువులకు వికలాంగులకు పెన్షన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ భూపతి రెడ్డి మాట్లాడుతూ పేదల అభివృద్ధి కోసమే తెలుగుదేశం పార్టీ ఉన్నదని తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్ర అభివృద్ధి చెందుతుందని అన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

### కుప్పం సిరి కళాక్షేత్రం ఆధ్వర్యంలో

## ఘనంగా కూచిపూడి రంగప్రవేశం

**శాంతిపురం,చిత్తూరు ఎక్స్ ప్రెస్,మే 31:**





కుప్పంపట్టణంలోని సిరికళాక్షేత్రం కూచి పూడి రెండవ రంగాప్రవేశం కార్యక్రమం శనివారం సాయంత్రం పట్టణంలోని శ్రీవాణి మహల్‌లో కుప్పం చిన్నారులు సంజన, ఆర్ అక్షయ సాయి, ధన్వంత్రి సాయి, జే ప్రణతి, ఏ డింపుల్ రీతు శ్రీ, నృత్యంతో ఆలరించారు. ఈ కార్యక్రమా న్ని ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ ముని రత్నం, కుప్పం మున్సిపాలిటీ చైర్మన్ సెల్వరాజ్, టిడిపి రాష్ట్ర నాయకులు డాక్టర్ వెంకటేష్ నియోజక వర్గ టీడీపీ అధ్యక్షురాలు అనసూయ, జ్యోతి ప్రజ్వళనచేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ చిన్నారుల నృత్య ప్రదర్శన ను మెచ్చుకొని, కార్యక్రమ నిర్వాహకులును అభినందించారు. ఈ కార్యక్రమంలో సిరి కళా క్షేత్రం కూచిపూడి కుప్పం శ్రీమతి కె.పి సునీత మహేష్, కుమారి అంబ సంద్రసిందూ, చిన్నారి తల్లిదండ్రులు కుప్పం పురప్రజలు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## సబ్ కలెక్టర్‌ను సన్మానించిన రేషన్ డీలర్లు



**పలమనేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, మే 31:**

పలమనేరు నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన రేషన్ డీలర్లు పలమనేరు సబ్ కలెక్టర్‌ను శనివారం ఘనంగా సన్మానించారు. జూన్ ఒకటవ తేదీ నుంచి రేషన్ దుకాణాలలో డీలర్ల ద్వారానే నిత్యావసర సరుకుల పంపిణికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడాన్ని హర్షిస్తూ పలమనేరు రూరల్, మండలంలోని డీలర్లు సబ్ కలెక్టర్ ను సన్మానించారు. ఈ సందర్భంగా స్థానిక ఎండియు (మొబైల్ డిస్పెన్సరి యూనిట్) వాహనాలను తొలగించి రేషన్ సరుకుల పంపిణిని డీలర్లు చేపట్టేవిధంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం శుభ పరిణామము ప్రజలకు ఏమాత్రం ఇబ్బందులు తలెత్తకుండా పారదర్శకంగా నిత్యావసరాల పంపిణిచేస్తామని వారన్నారు. చేపట్టాలని కార్యక్రమంలో డీలర్ల సంఘనాయకులు యువరాజు విశ్వనాథ రెడ్డి, రెడ్డప్ప, మునిరత్నం, వినోద్, మోహన్ రామిరెడ్డి, బసవరాజు, నరసింహ రెడ్డి,రవిస్వామి,ప్రకాష్, గంగి రెడ్డి తదితరులున్నారు.

## ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమం



**వెదురుకుప్పం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, మే31:**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు, అలానే ప్రభుత్వ విప్ మరియు గంగాధర నెల్లూరు నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ వి.ఎం థామస్ సూచనల మేరకు శనివారం రోజు వెదురుకుప్పం మండలం బొమ్మాయపల్లి పంచాయతీ తెట్టుగుంట పల్లి గ్రామంలో ఒక్కరోజు ముందుగానే ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకాన్ని కూటమి నేతల ఆధ్వర్యంలో అమలు చేయడం జరిగింది. ఒక్కరోజు ముందుగానే పెన్షన్ అందడం వల్ల పూర్తిస్థాయి సంతోషం, సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు గురుసాల కిషన్ చంద్, నియోజకవర్గ వాణిజ్య విభాగ అధ్యక్షులు బట్టె చాణిక్య ప్రతాప్, బిజెపి ఎస్సీ మోచన్ ప్రధాన కార్యదర్శి పాముల శేషాద్రి కుమార్, బూత్ కన్వీనర్ పవన్, బూత్ కన్వీనర్ ప్రసాద్, బొమ్మయపల్లి ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం, ముని వెంకటప్ప, మునిశేఖర్, యువ నాయకులు రెడ్డి కుమార్, నాగార్జున, సురేష్, కరుణ శ్రావణ్, అజిత్ రెడ్డి, మహిళా పోలీస్ శ్వేత మరియు అంగన్వాడి టీచర్ విశాలాక్షి పాల్గొన్నారు.

## చౌక దుకాణాల్లో నిత్యావసర సరుకుల పంపిణీకి సిద్ధం



**చౌడేపల్లి,చిత్తూరు ఎక్స్ ప్రెస్,మే31:**

చౌడేపల్లి మండలంలోని చౌకదుకాణాలలో జూన్1 నుంచి నిత్యావసర సరుకుల కంపెనీకి సిద్ధం చేసినట్లు తహసిల్దార్ హనుమంతు ఆపారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మండలంలో గల 33 చౌక దుకాణాలలో ప్రభుత్వ నిర్దేశిత ప్రకారం అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన వివరించారు. కార్డు దారులు ఉదయం నుంచి చౌక దుకాణాల వద్ద సామాగ్రి తీసుకోవచ్చునన్నారు. ప్రతి ఒక్క కార్డుదారుడు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకో వాలన్నారు.

### దుప్పిని హతమార్చిన వ్యక్తిని

## అరెస్ట్ చేసిన అటవీశాఖ అధికారులు



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,31:**

మల్లప్ప కొండ అటవీ ప్రాంతంలో దుప్పిని హతమార్చిన వ్యక్తి అరెస్ట్, కుప్పం అటవీ శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడిన ఎఫ్.ఆర్.ఓ. జయశంకర్. తమకు అందిన సమాచారం మేరకు మల్లప్పకొండ అటవీ ప్రాంతంలో దాడులు నిర్వహించాం. కుప్ప మండలానికి చెందిన కనకరాజు దుప్పిని తుపాకీతో కాల్చి హతమార్చాడు. కనక రాజును అరెస్టు చేసి, తుపాకి, ఓ ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసాంచేశామని తెలిపారు.అడవి జంతువుల ను వేటాడితే కఠిన చర్యలు తప్పవని అటవీశాఖ అధికారులు తెలియజేశారు.

# మాది పేదల ప్రభుత్వం

-మొదటిపేజీ తరువాయి



పెన్షన్ ఇచ్చామన్నారు. ధనిక రాష్ట్రం మహారాష్ట్రలో పెన్షన్ రూ. 1000, తెలంగాణలో రూ.2500 మాత్రమే పింఛన్లు ఇస్తున్నారన్నారు. అధిక పెన్షన్ ఇచ్చే ఏకైక రాష్ట్రం ఏపీ అని తెలిపారు. 3 నెలల పెన్షన్ ఒకేసారి తీసుకునే అవకాశం ఇచ్చామన్నారు. మెగా డీఎస్సీతో ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో 5 లక్షల మంది వర్క్ ఫ్రమ్ హోమ్ కింద ఉద్యోగం చేస్తున్నారని తెలిపారు. ఉచిత సిలెండర్ల కోసం నాలుగు నెలలకోసారి అకౌంట్‌లో డబ్బులు జమ అవుతున్నాయన్నారు. రూ.1200 కోట్లతో రాష్ట్రంలో రోడ్లు రిపేర్ చేశామన్నారు. 203 అన్నా క్యాంటీన్లో భోజనం అందిస్తున్నామన్నారు. రూ.1674 కోట్లు పాత ధాన్యం బకాయిలు చెల్లించామని తెలిపారు. నియోజకవర్గంలో 10 వేల సోలార్ కనెక్షన్లు ఏర్పాటు చేయకపోతే ఎమ్మెల్యే పవర్ కట్ చేస్తామని హెచ్చరించారు. గంజాయి, డ్రగ్స్ చాలా ప్రమాదకరమన్నారు. వైసీపీ ప్రభుత్వంలో విచ్చల విడిగా లభ్యమయ్యాయని మండిపడ్డారు. శాటిలైట్ డ్రోన్స్ ద్వారా గంజాయి నిర్మూలన చేస్తున్నామన్నారు. స్కూళ్లు తెరిచేలోగా ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం ఇస్తామని మరోసారి స్పష్టం చేశారు. దేశంలో దక్షిణాది రాష్ట్రాల్లో జనాభా తగ్గిపోయిందని.. రాష్ట్రంలో జనాభా పెరగాలన్నారు. జూన్ నుంచి అన్నదాత సుఖీభవ అమలు చేయనున్నట్లు తెలిపారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని అమలులోకి తీసుకురానున్నట్లు చెప్పారు. కడప మహానాడులో తన జీవితంలో చూడని స్పందన చూశానని అన్నారు. ఎప్పటికీ ఈ ప్రభుత్వాన్ని నిలబెట్టుకునే బాధ్యత ప్రజలదే అని చెప్పారు. మరో రెండు నెలల్లో అన్ని ప్రభుత్వ సేవలు వాట్సాప్ గవర్నెన్స్‌లో అందుబాటులోకి వస్తాయన్నారు. కోనసీమలో 1996 తుఫాన్ బీభత్స రోజులను గుర్తు చేసుకున్న సీఎం.. నాడు తాను స్వయంగా చేపట్టిన సహాయక చర్యల గురించి వివరించారు. అందరికీ సామాజిక న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఎవరికీ అన్యాయం జరగకుండా వర్గీకరణ చేస్తామని.. భవిష్యత్తులో జిల్లాల స్థాయిలోనూ రిజర్వేషన్లు ఉంటాయన్నారు. రాజకీయాలు చేస్తూ తప్పుడు ఆరోపణలు చేస్తే ఊరుకోనని హెచ్చరించారు. బాబాయి హత్యలోనూ రాజకీయం చేశారని... ఇప్పుడు కూడా అలాగే చేయాలని అనుకుంటున్నారని మండిపడ్డారు. టీటీడీలో అరాచకాలు చేస్తూ ప్రభుత్వం ఫెయిల్ అయిందని చెప్పాలని చూశారని.. టెక్నాలజీ వాడి తప్పులు బయటకు తీస్తామని వార్నింగ్ ఇచ్చారు. రాయలసీమలో ఎన్నికలు వస్తే బాంబులు అడిగేవారని.. ఇప్పుడు ముఠాలు లేవన్నారు. కోనసీమలో అంబేద్కర్ విగ్రహాలను దెబ్బ తీస్తూ.. విగ్రహాల రాజకీయం చేస్తున్నారని ఫైర్ అయ్యారు. కోనసీమ అనంతపురం కంటే వెనుకబడిపోయిందని అన్నారు. త్వరలో సంక్షేమ క్యాలెండర్ విడుదల చేస్తామన్నారు. రేషన్ వాహనాల పేరుతో అరాచకం చేశారని మండిపడ్డ సీఎం.. జూన్ 1నుంచి రేషన్ షాపుల్లో బియ్యం సరఫరా చేయనున్నట్లు తెలిపారు. పేరుకు మాత్రమే డోర్ డెలివరీ అని.. ఆ బియ్యాన్ని అక్కడే తీసుకుని కాకినాడ పోర్టుకి ఎగుమతి చేశారని ఆరోపించారు. గత ప్రభుత్వంలో మాఫియా చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్రానికి నేర చరితులు వచ్చారని.. దానికి రాజకీయ ముసుగు తొడిగారని వ్యాఖ్యలు చేశారు. ఆర్థిక ఉగ్రవాదులు సమాజాన్ని అతలాకుతలం చేయాలని అనుకుంటున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

# గులాబీని దూరం పెట్టేసిన కవిత




**అదిలాబాద్ :** బీఆర్ఎస్ నాయకులు మీడియాతో మాట్లాడినా, ప్రజల్లోకి వెళ్లి ఏదైనా కార్యక్రమాలు చేసినా, లేక పార్టీ కార్యక్రమాలు చేపట్టినా తప్పనిసరిగా ధరించేది బీఆర్ఎస్ కండువానే! ఈ విషయంలో సందేహం లేదు. ఏదైనా మర్చిపోతే తప్ప, లేకపోతే నాయకులు ఎంతటి వారైనా, ఎంత ఉన్నత పదవిలో ఉన్నా ఖచ్చితంగా కండువా వేసుకోవాలనీ గతంలో కేసీఆర్ కూడా ఆదేశించారు. అలా చేయకపోతే వారిని పార్టీ నాయకులుగా ఎలా గుర్తించాలని ఆయన కఠినంగానే హెచ్చరించారుదీనికి కారణం ఉంది. తొలి విడత ప్రభుత్వం ఏర్పాటు చేసిన తర్వాత కొందరు ధిక్కార స్వరం వినిపించారు. అయినా పార్టీలోనే ఉన్నారు. కానీ వారు కండువాను విస్మరించారు. తద్వారా తమ నిరసనను పార్టీ నాయకుడికి చెప్పాలన్నదే వారి వ్యూహం అయి ఉండొచ్చు. కానీ కేసీఆర్ ఈ విషయంలో స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. "మీరు ఏం చేసినా కండువా వేసుకోండి. అదే మనకు గుర్తింపు. మీరు మర్చిపోయానని చెబితే కేసీఆర్ క్షమిస్తాడు, కానీ తెలంగాణ సమాజం క్షమించదు," అని అన్నారు.కట్ చేస్తే? తాజాగా కేసీఆర్ కుమార్తె కవిత కండువాను పక్కన పెట్టారు. గురువారం ఆమె మీడియాతో చిట్‌చాట్ చేసినప్పుడు కానీ, అదే సమయంలో కొందరు యువకులు తెలంగాణ జాగృతిలో చేరినప్పుడు కానీ, ఆమె వారికి జాగృతి జెండాలనే కప్పారు తప్ప, బీఆర్ఎస్ జెండాలను మెడలో వేయలేదు. తాను కూడా వేసుకోలేదు. వాస్తవానికి గులాబీ వర్ణంలో మెరిసిపోయే బీఆర్ఎస్ కండువాపై కేసీఆర్, కారు గుర్తులు ముద్రించి ఉంటాయి. వీటిని ధరించడం నాయకులు గౌరవంగా కూడా భావిస్తారు.ఇక తాజాగా మంచిర్యాలలో పర్యటిస్తున్న సమయంలో కూడా కవిత బీఆర్ఎస్ కండువాను పక్కన పెట్టారు. ఢిల్లీ మద్యం పాలసీ కేసులో అరెస్టై తాను జైల్లో ఉన్నప్పుడు బిజెపి లో కలుపుతామనీ పార్టీ నేతలు కొందరు చెప్పారు. అయితే బీజేపీలో బీఆర్ఎస్ విలీనానికి నేను అప్పుడే ఒప్పుకోలేదు. ఇప్పుడు ఎందుకు ఆ నిర్ణయాన్ని సమర్థిస్తాను. పార్టీ అధినేత కేసీఆర్ కు తాను లెటర్ రాయడం లో నా తప్పేం లేదన్నారు. తన తండ్రి కేసీఆర్ ను కలిసే అవకాశం వచ్చింది , కానీ కలవలేకపోయాను. ఈ క్రమంలో ఆయనకు కొన్ని విషయాలు స్పష్టం చేసేందుకు లేఖ రాసినట్లు స్పష్టం చేశారు. కేసీఆర్ తనకు అధినేత, గురువు అని.. పార్టీ అధినేతకు తాను గతంలో పలు లేఖలు రాసినట్లు తెలిపారు. కానీ వాటిని వదిలిపెట్టి, కేవలం ఈ లెటర్ బయటికి తెచ్చిన వారు ఎవరు, ఈ కుట్ర వెనుక ఉన్న వారిని పట్టుకోండి అని ఛాలెంజ్ విసిరారు.మంచిర్యాలలో జరుగుతున్న వివాహానికి వెళ్తున్న సందర్భంగా కవిత పెద్దపల్లి పట్టణంలో అయ్యప్ప టెంపుల్ చౌరస్తా వద్ద ఆగారు. అక్కడ తెలంగాణ తల్లి విగ్రహానికి పూల మాల వేశారు. పెద్దపల్లిలో ఎమ్మెల్సీ కవితకు పెద్దపల్లి నియోజకవర్గం ఃఖీూ నాయకురాలు దాసరి ఉష ఘన స్వాగతం పలికారు. ఆమె వెంట బీఆర్ఎస్ నాయకులు జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, కౌన్సిలర్ లు, వార్డ్ మెంబర్లు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.ఆమె తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు సమర్పించినప్పుడు కానీ, యువకులతో ముచ్చటించేప్పుడు కానీ ఎక్కడా బీఆర్ఎస్ కండువా ఆమె మెడలో కనిపించలేదు. మరి ఆమె ఉద్దేశపూర్వకంగానే ఇలా చేశారా? లేక మరిచిపోయారా? అనేది చర్చగా మారింది. మరిచిపోయినా, ఉద్దేశపూర్వకంగా చేసినా? కేసీఆర్ గతంలో చెప్పినట్లు అది సీరియస్ మ్యాటరే. సో? ఏం జరుగుతుందో చూడాలి.

# ఎర్త్ ఎవరికి..బెర్త్ ఎవరికి... ఆ నలుగురికి చెక్



**హైదరాబాద్ :** తెలంగాణ కాంగ్రెస్‌లో పదవుల భర్తీ డైలీ ఎపిసోడ్ అయిపోయింది. రోజుకో ట్విస్ట్..క్లైమాక్స్‌లో ఇంటర్వెల్ రేంజ్‌లో ఏదో ఒక అడ్డంకి వచ్చి పడుతూనే ఉంది. అయితే ఈసారి అన్నింటినీ క్లియర్ చేస్తూ పార్టీ అధిష్టానం ముందుకెళ్తోందట. జూన్ మొదటి వారంలో క్యాబినెట్ విస్తరణ చేయాలని ఫిక్స్ అయినట్లు పార్టీ వర్గాల టాక్. అందుకు అనుగుణంగా పార్టీ కమిటీలను కూడా ఒక్కొక్కటిగా భర్తీ చేస్తోంది. పార్టీ అతి కీలకమైన పీఏసీతో పాటు అడ్వైజరీ, క్రమశిక్షణ కమిటీ, డీలిమిటేషన్ కమిటీ, సంవిధాన కమిటీలను నియమిస్తూ ఏఐసీసీ ఆదేశాలు జారీ చేసింది. దీంతో మిగతా వాటికి లైన్ క్లియర్ అయ్యిందనే చర్చ పార్టీలో జోరుగా నడుస్తోంది.కమిటీల నియామకంతో క్యాబినెట్ కూర్పుపై ఇన్ డైరెక్ట్‌గా ఇండికేషన్ ఇచ్చినట్లేననే చర్చ పార్టీలో జరుగుతోంది. పార్టీలో అత్యున్నత నిర్ణయాత్మక కమిటీ అయిన పీఏసీలోకి నలుగురు మంత్రులు మినహా అందరికి అవకాశం కల్పించారు. పీఏసీలో క్యాబినెట్ మంత్రులందరూ ప్రత్యేక ఆహ్వానితులుగా ఉంటారని మెన్షన్ చేసినా.. నేరుగా ఆ నలుగురు మంత్రుల పేర్లు లేకపోవడం చర్చకు దారితీస్తోంది.ప్రధానంగా పీఏసీలో కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిలకు ఛాన్స్ దక్కలేదు. వీరిలో కొండా సురేఖకు క్యాబినెట్ నుంచి కచ్చితంగా ఉద్వాసన పలుకుతారనే చర్చ బలంగా నడుస్తోంది. అందుకే ఆమె ప్లేస్‌లో పీఏసీ కమిటీలోకి అదే సామాజికవర్గం మున్నూరు కాపుకు చెందిన ఆది శ్రీనివాస్‌కు కమిటీలో చోటు దక్కిందంటున్నారు. దీని ద్వారా మంత్రివర్గంలో కూడా ఆది శ్రీనివాస్‌కు పక్కా ఛాన్స్ ఉంటుందనే టాక్ నడుస్తోంది.ఇక మిగతా మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, జూపల్లి కృష్ణారావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలకు ఎందుకు ఛాన్స్ రాలేదనే చర్చ జరుగుతోంది. పీఏసీ కమిటీలో ఛాన్స్ దక్కని మిగతా ముగ్గురు మంత్రులకు చెందిన సేమ్ సామాజిక వర్గం నుంచి ఇతర నేతలకు అవకాశం కల్పించడంలో వ్యూహం ఏమై ఉంటుందనే చర్చ జరుగుతోంది.మంత్రి జూపల్లి సామాజికవర్గానికి చెందిన ప్రేమ్‌సాగర్ రావుకు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సామాజికవర్గానికి చెందిన సుదర్శన్‌రెడ్డికి, తుమ్మల నాగేశ్వరరావు సామాజిక వర్గానికి చెందిన జెట్టి కుసుమ్ కుమార్‌కు ఛాన్స్ దక్కింది. ఇలా వీరికి ఛాన్స్ ఇవ్వడంలో మతలబు ఏంటనేది హాట్ టాపిక్‌గా మారింది. ప్రేమ్‌సాగర్ రావు, సుదర్శన్‌రెడ్డిలు ఎమ్మెల్యేలుగా ఉన్నారు. జెట్టి కుసుమ్ మాత్రం ఏ సభలో కూడా ప్రాతినిధ్యం లేదు. అయితే మంత్రి తుమ్మల పార్టీ కార్యక్రమాల్లో యాక్టివ్‌గా పాల్గొనరు కాబట్టి ఆ ప్లేస్‌లో సీనియర్ నేత జెట్టికి అవకాశం ఇచ్చారనే టాక్ ఉంది.పీఏసీలో మంత్రులకు చోటు కల్పించకపోవడం ఒక చర్చ అయితే.. రాజ్యాంగ బద్ధ పదవుల్లో ఉన్న వారిని పార్టీ పదవుల్లో నియమించడంపై చర్చనీయాంశంగా మారింది. తెలంగాణ ఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్‌గా ఉన్న సిరిసిల్ల రాజయ్య, రైతు కమిషన్ మెంబర్‌గా ఉన్న రాములు నాయక్‌కు పీఏసీలో చోటు కల్పించడం చర్చకు దారి తీసింది. రాజ్యాంగ బద్ధ పదవుల్లో ఉన్న ఇద్దరు నేతలను పార్టీ కమిటీల్లోకి తీసుకోవడం ఏంటన్నది కాంగ్రెస్ నేతలకే అర్థం కావటం లేదట. అయితే పీఏసీ కమిటీ లిస్ట్‌లో ఎవరికి చోటు కల్పించారో.. ఎవరు ఎంపిక చేశారో కూడా పీసీసీ చీఫ్‌తో సహా ఎవరికి తెలియదట. అధిష్టానం డైరెక్టుగా లిస్ట్ ఇచ్చినట్లు గాంధీభవన్‌లో గుసగుసలు వినిపిస్తున్నాయి.ఇక పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్టుల విషయంలో కూడా కొలిక్కి వచ్చినట్లు తెలుస్తోంది. వర్కింగ్ ప్రెసిడెంట్లుగా సంపత్ కుమార్, బలరాం నాయక్, రోహిణ్ రెడ్డి, ఫహీం ఖురేషిల పేర్లు దాదాపు ఖరారైనట్లు చర్చ జరుగుతోంది. ఈ కమిటీ విషయంలో స్పష్టత రాగానే వర్కింగ్ ప్రెసిడెంట్లతో పాటు జనరల్ సెక్రటరీ, వైస్ ప్రెసిడెంట్ల పోస్టులను భర్తీ చేస్తారట. ఒక్క పీఏసీ కమిటీ నియామకం రకరకాల చర్చలకు దారి తీస్తోంది. క్యాబినెట్ కూర్పు, వర్కింగ్ ప్రెసిడెంట్ల నియామకానికి అదొక ఇండికేషన్ అంటున్నాయి హస్తం పార్టీ వర్గాలు. క్యాబినెట్ కూర్పు జూన్ మొదటి వారంలో ఉండనున్న నేపథ్యంలో ..ఛాన్స్ దక్కే లక్కీ పర్సన్ పేర్ల విషయంలో ఒకటి, రెండు రోజుల్లో మరింత స్పష్టత రానుంది.

## టెన్త్ పరీక్షల నిర్వహణలో తండ్రీ, కొడుకు ఫెయిల్

-మొదటిపేజీ తరువాయి

మీ అవివేక, అనాలోచిత, పరిణితిలేని నిర్ణయాలతో విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు కష్టాలే ఎదురవుతున్నాయి. 10వ తరగతి పరీక్ష పత్రాల మూల్యాంకనాన్ని కూడా సరిగ్గా నిర్వహించలేని దుస్థితిలో ఉన్న మీరు, మిగతా వ్యవస్థలను ఇంకా ఎంత ఘోరంగా నడుపుతున్నారో అర్థం అవుతోంది. 6.14 లక్షల మంది రాత్రీపగలూ కష్టపడి చదివి పరీక్షలు రాస్తే, జవాబు పత్రాలను సరిగ్గా దిద్ది, పారదర్శకంగా ఫలితాలు వెల్లడించాల్సిన మీరు, ఘోరంగా విఫలమై, విద్యార్థులను, వారి తల్లిదండ్రులను క్షోభకు గురిచేశారు. ఇప్పుడు ప్రతి స్టూడెంట్‌కూడా తన మార్కుల జాబితాపై అనుమానాలు వ్యక్తంచేసే పరిస్థితిని తీసుకు వచ్చారు. మీరు చేసిన తప్పులు కారణంగా ట్రిపుల్ ఐటీ, గురుకుల జూనియర్ కాలేజీలు సహా ఇతరత్రా అడ్మిషన్లలో విద్యార్థులు అన్యాయమైపో యిన ఘటనలు రాష్ట్రవ్యాప్తంగా ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. చంద్రబాబుగారూ దీనికి ఎవరు బాధ్యత వహిస్తారు? అసలు పరీక్షల నిర్వహణ సమయంలోనే మీ బేలతనం బయటపడింది. ప్రశ్నపత్రాలు లీకేజీ అయ్యాయి. అయినాసరే తప్పులను సరిదిద్దుకోకపోవడం మీ అసమర్థతకు నిదర్శనం కాదా? మన రాష్ట్రంలో చదివే ప్రతి విద్యార్థి ప్రపంచస్థాయిలో పోటీని ఎదుర్కొనేలా తీసుకొచ్చిన అనేక సంస్కరణలను వచ్చీరాగానే దెబ్బతీశారు. స్కూళ్లలో నాడు%-%నేడు, గోరుముద్ద, ఇంగ్లీషు మీడియం, సీబీఎస్ఈ నుంచి ఐబీ వరకూ ప్రయాణం, 3వ తరగతి నుంచే టోఫెల్ క్లాసులు, 8వ తరగతి విద్యార్థులకు ట్యాబులు, 3వ తరగతి నుంచే సబ్జెక్టుల వారీగా బోధన ఇలా ప్రతి మంచి కార్యక్రమాన్ని కక్షగట్టి నీరుగార్చారు. తల్లులను ప్రోత్సహిస్తూ ఇచ్చే అమ్మ ఒడిని రద్దుచేశారు. ఇప్పుడు పరీక్షలు నిర్వహణ, ఫలితాల వెల్లడిలోనూ విఫలమవుతున్నారు. చంద్రబాబుగారూం మీరు చేసిన తప్పుల వల్ల విద్యార్థులు బలైపోవడానికి వీల్లేదు. ఎలాంటి ఫీజు లేకుండా కోరిన ప్రతి విద్యార్థి జవాబు పత్రాలను రీవాల్యుయేషన్ చేయండి. తుది ఫలితాలు వచ్చేంతవరకూ టెన్త్ మార్క్స్ ప్రాతిపదికగా చేస్తున్న అడ్మిషన్లను కొన్నిరోజులపాటు నిలిపివేయండి. తప్పులకు బాధ్యులైన విద్యాశాఖ మంత్రి లోకేష్‌తో మొదలు అందరిపైనా చర్యలు తీసుకోవాలని వైయస్ జగన్ డిమాండ్ చేశారు.

## గోశాలల ఏర్పాటుకు కమిటీ..

-మొదటిపేజీ తరువాయి

సమావేశంలో సీఎంఓ అధికారులు శేషాద్రి, శ్రీనివాసరాజు, మాణిక్ రాజ్, అజిత్ రెడ్డి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ సవ్యసాచి ఘోష్, హెచ్ఎం ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, పశుపోషణ విభాగం డైరెక్టర్ బి.గోపి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. మరోవైపు.. వేములవాడ రాజన్న ఆలయంలో కోడెలు మరణించడం తీవ్ర కలకలం రేపుతోంది. రెండు రోజుల క్రితం దాదాపు ఎనిమిది కోడెలు మృత్యువాత పడగా.. మరో 10 కోడెలు అనారోగ్యంతో బక్కచిక్కిపోయిన ఉన్నట్లు తెలుస్తోంది. రాజన్న భక్తులు మొక్కులు చెల్లించుకునేందుకు స్వామి వారికి కోడెలను అందజేస్తుంటారు. గోశాలలో దాదాపు రెండు వేల వరకు కోడెలు, ఆవులు ఉన్నాయి. కోడెల సంరక్షణ కోసం 11 షెడ్లను ఏర్పాటు చేశారు. అయితే ఈ షెడ్లలో ఉండాల్సిన వాటికంటే ఎక్కువగా కోడెలు ఉన్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా కోడెల సంఖ్యలకు సంబంధించి అధికారులు సరైన సమాధానాలు చెప్పకపోవడం, కోడెలకు ట్యాగ్‌లు లేకపోవడంతో అనేక కోడెలు పక్కదారి పడుతున్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏది ఏమైనా దేవుడికి మొక్కుగా ఇస్తున్న కోడెలు ఇలా అధికారులు నిర్లక్ష్యం కారణంగా మృత్యువాతపడటం పట్ల భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## కవిత వ్యవహారం.. అదంతా ఫ్యామిలీ డ్రామా

-మొదటిపేజీ తరువాయి

అనుగుణంగా గోశాలను విస్తరించాలి. రాజన్న ఆలయం నిధులను మాజీ సీఎం వేరే చోట ఖర్చు చేశారు. మన సైన్యం ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసేలా సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు ఉన్నాయి. పాక్‌పై యుద్ధం ఇంకా కొనసాగుతుందని ప్రధాని మోదీ చెప్పారు. ఉగ్రవాదాన్ని తుదముట్టించే వరకు యుద్ధం కొనసాగుతుంది " అని బండి సంజయ్ అన్నారు.

## అద్భుతమైన 'ఆపరేషన్' నిర్వహించారు

-మొదటిపేజీ తరువాయి

భారత ఎయిర్‌ఫోర్స్ విజయం పట్ల మేము గర్విస్తున్నామని, ఇదొక అద్భుతమైన ఆపరేషన్ అని ఉత్తమ్ కొనియాడారు. ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేయడం భారత్ ఎయిర్‌ఫోర్స్ సాధించిన విజయమన్నారు. ఫైటర్ విమానాలు, ఆయుధాల సప్లయ్ ఆలస్యం అవుతున్నాయని ఎయిర్ చీఫ్ మార్షల్ చెప్పడం ఆందోళన కల్గిస్తోందన్నారు. చైనా, పాకిస్తాన్‌లతో ముప్పు నేపథ్యంలో భారత భద్రతను పటిష్టం చేయాల్సిన అవసరం ఉందన్నారు. తేలికపాటి యుద్ధ విమానాల సప్లై అంశం కూడా ఆలస్యం అవుతుందని, అత్యవసరంగా ఈ సమస్యను పరిష్కరించాలని కేంద్రానికి సూచించారు. ఆపరేషన్ , ఆర్ అండ్ డి(రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్) విభాగాలలోకి బెస్ట్ బ్రెయిన్స్ రావడం లేదని ఉత్తమ్ పేర్కొన్నారు.

## కవిత వెనుక మాస్టర్ మైండ్ ఎవరు...



**హైదరాబాద్:** బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వెనక ఎవరున్నారు? ఆమె సొంత నిర్ణయాలే వెనక ఉండి ఎవరైనా నడిపిస్తున్నారా? అన్న అనుమానాలు వ్యక్తమవుతు న్నాయి. కవిత సోదరుడిపైనే తిరుగుబాటు చేసేంత పరిస్థితి ఎందుకొచ్చిందన్న దానిపై బీఆర్ఎస్ నేతలు ఆరా తీస్తున్నారు. కవిత వెనక ఏ పార్టీ నేతలు అయినా ఉన్నారా? లేక తమ పార్టీలో ఉన్న నేతలే బ్యాక్ ఉండి ప్రోత్సహిస్తున్నారన్న సందేహం అందరిలోనూ కలుగుతుంది. బీఆర్ఎస్ లో కేసీఆర్ తర్వాత కేటీఆర్ లీడర్ అన్నది అందరికీ దాదాపు రెండేళ్ల క్రితమే క్లారిటీ వచ్చింది. అయితే ఇప్పుడు కవిత బరస్ట్ అవ్వడానికి కారణాలు ఏంటన్న దానిపైనే అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కల్వకుంట్ల కవితను ఈడీ అధికారులు అరెస్ట్ చేయడానికి వచ్చినప్పుడు కూడా కేటీఆర్ కవిత ఇంటికి వెళ్లారు. అక్కడే ఉండి ఈడీ అధికారులతో వాగ్వాదానికి కూడా దిగారు. ఇక కవిత తీహార్ జైలులో ఉన్న సమయంలో అనేక సార్లు ఢిల్లీ వెళ్లి కలసి వచ్చారు. న్యాయవాదులతోనూ బెయిల్ కోసం కేటీఆర్ హస్తినకు బయలుదేరి వెళ్లారు. జైలు నుంచి బయటకు వచ్చినప్పుడు కూడా కేటీఆర్ అక్కడే ఉండి ఇంటికి తీసుకు వచ్చారు. ఇంత బాగా ఉన్న అన్నా చెల్లెళ్ల అనుబంధానికి గండి ఎక్కడ పడిందన్న దానిపైనే అందరికీ సందేహాలు తలెత్తుతున్నాయి. తీహార్ జైలులో ఉన్నప్పుడే బీజేపీలో విలీనం చేయాలన్న ప్రతిపాదన వచ్చిందని, దానిని వ్యతిరేకించానని కవిత చెప్పే విషయం కూడా నమ్మశక్యంగా లేదంటున్నారు. కేసీఆర్ ఉద్యమ పార్టీగా పెట్టి తర్వాత దానిని జాతీయ పార్టీగా మార్చింది విలీనం చేయడానికి కాదు గదా? అన్న ప్రశ్న తలెత్తుతుంది. బీజేపీలో విలీనం చేస్తే కేసీఆర్ కు వచ్చే ప్రయోజనం ఏంటో అర్థం కూడా కావడం లేదు. బీజేపీలో ఒక నాయకుడిగానే మారతారు. మహా అయితే కేంద్రంలో మంత్రిపదవి దక్కుతుంది. రాష్ట్రం వారి చేతుల్లోకి పెట్టడానికి ఏ ప్రాంతీయ పార్టీ నేత అయినా ఎందుకు మొగ్గు చూపుతారన్న అనుమానం అందరిలోనూ కలుగుతుంది. అందులోనూ బీఆర్ఎస్ కు క్షేత్రస్థాయిలో బలమైన క్యాడర్ ఉంది. ఓటు బ్యాంకు ఉంది. అంతకు మించి కేసీఆర్ అనే శక్తి ఉంది. వీటన్నింటినీ కాదని కమలం పార్టీలో కలిపేయడానికి కేసీఆర్ ఏం రాజకీయ అనుభవం లేని నేత కాదు గదా? అన్న ప్రశ్నకు మాత్రం సమాధానం దొరకడం లేదు. కవిత తాను బయటకు వెళ్లడానికి ఈ సాకు చెబుతున్నారన్న అభిప్రాయం కూడా కార్యకర్తల్లో ఏర్పడింది. గత కొద్ది రోజులుగా జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే ఇది కేవలం రాజకీయ పదవుల కోసం కాదని, ఆస్తి విషయాలుకూడా అయి ఉండవచ్చన్న సందేహాలు అందరిలోనూ కలుగుతున్నాయి. అయితే ఆ విషయం బయటకు చెప్పకుండా ఇలా బీజేపీలో విలీనం చేస్తారని బురద జల్లి బయటకు వెళ్లిపోవడానికి కవిత ఏమైనా ప్లాన్ వేశారా? అన్న అనుమానం అయితే అందరిలోనూ కలుగుతుంది. కేసీఆర్ నేరుగా రంగంలోకి దిగి కవితతో మాట్లాడితే ఇవన్నీ సమసిపోతాయని అంటున్నప్పటికీ కవిత చేసిన వ్యాఖ్యలు మాత్రం అన్నా చెల్లెళ్ల మధ్య గ్యాప్ మాత్రం కంటిన్యూ అవుతుందన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి.

## ఏరియా ఆస్పత్రి,108 సేవలను తనిఖీ చేసిన డిసి డాక్టర్ లోకవర్ధన్



**పీలేరు,చిత్తూరు ఎక్స్ ప్రెస్,మే 31:** అన్నమయ్య జిల్లా పీలేరు ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రిలో డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవలను, 108 వాహనాల సేవలను అన్నమయ్య జిల్లా సమన్వయకర్త డాక్టర్ లోకవర్ధన్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిసి మాట్లాడుతూ డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవల్లో భాగంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో సర్జరీలు జరిగేలా వైద్య మిత్రలు కృషి చేయాలని ఆదేశిం చారు. అలాగే ఎన్టీఆర్ వైద్య సేవల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. అనం తరం రోజూ వారీ ఓపి వివరాలు, వారిలో ఎంతమంది ఎన్టీఆర్ వైద్య సేవ పథకం లో నమోదు అయ్యారని ఆరా తీశారు. అనంతరం ఎన్టీఆర్ వైద్య సేవ వార్డులో ని రోగుల ను కలసి వారికి అందుతున్న సేవల గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం 108 అంబులెన్సును పరిశీలించి జాబితా ప్రకారం లాగ్ బుక్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య మిత్ర లక్ష్మి, 108 సిబ్బంది పాల్గొన్నారు.

డాక్టర్ కోటేశ్వరబాబు దయాళుత్వం

## పాత్రికేయుని కుటుంబానికి రూ. పది వేలు ఆర్థిక సాయం

**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, మే 31:**



శ్రీకాళహస్తి సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా లెక్కలేనన్ని జీవితాల్లో వెలుగులు నింపిన ప్రముఖ సంఘ సేవకులు, ఆంధ్రశ్రీ అవార్డు గ్రహీత, ఏపీడబ్ల్యుజే రాష్ట్రకౌన్సిల్ మెంబర్ డాక్టర్ యల్లంపాటి కోటేశ్వరబాబు మరోసారి దయాళుడై నిలిచాడు. వార్త దినపత్రిక తొట్టంబేడు మండల సీనియర్ పాత్రికేయులు చిట్టత్తూరు మెహర్ కుమార్ అకస్మికంగా మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ సమాచారం తెలిసే సమయానికి బయట ప్రాంతంలో ఉండడంతో అంత్యక్రియలకు హాజరు కాలేకపోయారు. దీంతో స్వర్గీయ మెహర్ కుమార్ నివాసానికి పలువురు పాత్రికేయులతో కలిసి కోటేశ్వరబాబు శనివారం వెళ్లారు. మెహర్ మాతృమూర్తిని ఓదార్చి తామంతా మీబిడ్డలమేనని ఆమెకు ధైర్యా నిచ్చారు. కర్మక్రియల నిమిత్తం తనవంతు సాయంగా రూ.పదివేలను ఆర్థిక సాయంగా అందించారు. ఎప్పుడు ఏ అవసరం వచ్చినా తామంతా ముందుంటామని ఈ సందర్భంగా ఆ తల్లికి మాటిచ్చారు. అనంతరం కోటేశ్వరబాబు మాట్లాడుతూమంచి హృదయం కలిగిన నిశ్వార్ధ జర్నలిస్టు మిత్రుడిని కోల్పోవడం బాధాకరమన్నారు. తన అక్షరాలతో కదలికలు తీసుకొచ్చి ప్రజలకు అండగా నిలిచిన సందర్భాలెన్నో ఉన్నాయని తెలిపారు. సీనియర్ జర్నలిస్టుగా మెహర్ పలువురికి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఎంతో మంది కొత్తగా వృత్తి లోకి వచ్చిన వారికి తన సలహాలు, సూచనలతో అక్షరాలనునేర్పి విలువలతో కూడిన జర్నలిజం చేశారని చెప్పారు. పాత్రికే యుల సంక్షేమం, అభివృద్ధే అజెండాగా శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి పనిచేస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యే స్ఫూర్తితో ఇవాళ తమవంతుగా ఈ చిరుసాయం అందించామన్నారు. కర్మక్రియలకు సంబంధించి మరింత సాయం అందించడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఈ కార్యక్ర మంలో సీనియర్ పాత్రికేయులు వీసీవెంకటయ్య, యాసీన్, బాలసుబ్రమణ్యం, సహ చర పాత్రికేయులు, చాన్‌బేగం, జాకీర్, హిమబిందు, సుమన్, పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

# ఈటిసి సెంటర్ ప్రిన్సిపాల్ నాగపద్మజ పదవి విరమణ శుభాకాంక్షలు

**శ్రీకాళహస్తి,చిత్తూరు ఎక్స్ ప్రెస్,మే 31:** శ్రీకాళహస్తి ఈటిసి సెంటర్‌లో ప్రిన్సిపల్‌గా విధులు నిర్వహిస్తున్న, నాగపద్మజ పదవి విరమణ సందర్భంగా నాగపద్మజ, గుడ్లూరు జగన్మోహన్ నాయుడు దంప తులను ఇద్దరునీ శ్రీకాళహస్తీశ్వరస్వామి వారి దేవస్థానం మాజీ ధర్మకర్తలమండలి అధ్యక్షుల అంజూరు తారక శ్రీనివాసులు శేషవస్త్రంతో సత్కరించి, పులమల వేసి స్వామి అమ్మవార్ల చిత్ర పటాన్ని అందజేశారు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ ఈటిసి సెంటర్ లో ప్రిన్సిపల్ గా విధులు నిర్వహి స్తున్న నాగపద్మజ విరమణ శుభాకాంక్ష లు తెలియజేశారు. ఆత్మీయుల మధ్యలో పదవి విరమణ పొందడం సంతోషంగా ఉంది అన్నారు.నాగపద్మజ మంచి ఆలో చన విధంగా విధులు నిర్వహిస్తుంటారు. గవర్నమెంట్ ఎంప్లాయ్ ఆలోచన ఏ విధం గా ఉంటుందంటే డ్యూటీకి వచ్చామా అటెండెన్స్ రిజిస్టర్ సంతకం చేసి డ్యూటీ మైండ్ తోనే ఉండేవారు. ప్రతి గవర్న మెంటు ఉద్యోగస్తులు ఎక్కడ కూడా కాంట్రవర్సీకి దూరంగాఉంటారని తెలియజేశారు. నాకు పద్మ ప్రతి కాంట్రవర్సీకి దగ్గ రగా వెళతారు ప్రతిపనిని కూడాదగ్గరుండి పూర్తి చేసుకుని వస్తారు. అదేవిధంగా ఈ టి సి సెంటర్ అరణ్యంగా ఉండేది అదే మేడం గరు వచ్చిన తర్వాత ఈ టి సి సెంటర్ ను ఒక ఉద్యానవనంగా తీసుకొచ్చినారు తెలియజేశారు. ఈ టి సి సెంట ర్లో అనేక రాష్ట్రాల నుంచి వచ్చి ట్రైనింగ్ కోసం వచ్చే ఉద్యోగస్తులకు అన్ని విధాల సౌకర్యాలను ఏర్పాటు చేసేవారని తెలి యజేశారు. అదేవిధంగా గతంలో ట్రస్ట్ బోర్డు చైర్మన్ గా ఉన్నప్పుడు ఇక్కడ ఉన్న శివాలయానికి కుంభాభిషేకం జరిగి 30 సంవత్సరాలు అయింది మేడం సౌజన్యం తోనే మల్లా తిరిగి శివాలయానికి కుంబా భిషేకం చేస్తూ ఆలయ అభివృద్ధికి మేడం పూర్తిగా సహకరించారని తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన ఈటిసి సెంటర్ సిబ్బంది అందరికీ కూడా పేరుపే రునా ధన్యవాదాలు తెలియజేసుకుంటు న్నాను. ఈ కార్యక్రమంలో నియోజవర్గ యువత అధ్యక్షులు శ్రీవారి సురేష్, వేలూరు రమేష్,సాయి,ఈ టి సి సెంటర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# గోల్డ్ లోన్స్‌పై కేంద్రం కీలక నిర్ణయం.. కొత్త మార్గదర్శకాలు ప్రతిపాదనలో ఆర్‌బీఐ!

ఇంట్లో ఉన్న బంగారాన్ని తాకట్టు పెట్టి రుణం తీసుకోవడాన్ని గోల్డ్ లోన్ అంటారు. దీనికి సంబంధించి, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏకరీతి నియమాలను రూపొందించాలని నిర్ణయించింది. భారతదేశంలో బంగారాన్ని పెట్టుబడిగా భావిస్తారు. ఇది కష్ట సమయాల్లో ఉత్తమ మూలధనంగా ఉపయోగప డుతుంది. బహుశా ఈ నమ్మకం వల్లనే, పురాతన కాలం నుండి దేశంలో 'గోల్డ్ లోన్' లాంటి సౌకర్యం ఉంది. 'మదర్ ఇండియా' సినిమాలోని 'బిర్జు' ని మీరు గుర్తుంచుకునే ఉంటారు. అతను తన తల్లి తనఖా పెట్టిన గాజులను సుఖి లాలా నుండి విడిపించుకుంటాడు. ఎందుకంటే అతని తల్లి ఆ గాజులకు బదులుగా లాలా నుండి అప్పు తీసుకుంది. గతంలో, గ్రామాలు, పొరుగు ప్రాంతాలలో, ధనవంతులు లేదా వడ్డీ వ్యాపారులు తమ బంగారాన్ని తాకట్టుగా ఉంచి అవసరమైన వారికి నగదు ఇచ్చేవారు. అప్పుడు ఈ బంగారం తరచుగా జప్తు చేయడం జరిగేది. తరువాత, దీని నుండి ప్రజలను రక్షించడానికి, బ్యాంకులు, నాన్-బ్యాంకింగ్ ఫైనా న్స్ కంపెనీలు బంగారు రుణాల అందించడం ప్రారం భించాయి. ఇప్పుడు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంకులు, ఈ బంగారు రుణ సౌకర్యాన్ని ఏకరీతి నిబంధనల పరిధిలోకి తీసుకురావాలని కోరుకుంటోంది. సామాన్యుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఆర్‌బిఐకి అనేక సూచనలు చేసింది. భారత రిజర్వ్ బ్యాంక్ రూపొందించిన



బంగారు రుణాల కోసం ఏకరీతి నియమాల ముసాయిదాను ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని ఆర్థిక సేవల విభాగం సమీక్షించింది. దీని తరువాత, కొత్త నిబంధనలను అమలు చేసే ముందు అనేక విషయాలను దృష్టిలో ఉంచుకోవాలని =దీ×ని కోరింది. సామాన్యులకు బంగారు రుణం అవసరమని దృష్టిలో ఉంచుకుని, కొత్త నిబంధనలను అమలు చేస్తున్నప్పుడు, చిన్న మొత్తాలకు రుణాలు తీసుకునే వారిపై ప్రతికూల ప్రభావం చూపకూడదని ప్రభుత్వం పేర్కొంది. అంతే కాదు, వీలైతే, రూ. 2 లక్షల వరకు బంగారు రుణం తీసుకునే వ్యక్తులను ఆర్‌బిఐ ఈ కఠినమైన నిబంధనల పరిధికి దూరంగా ఉంచాలి. తద్వారా చిన్న రుణగ్రహీతలు త్వరగా, సకాలంలో బంగారు రుణాన్ని పొందవచ్చు. ఈ బంగారు రుణ నియమాలను సరిగ్గా అమలు చేయడానికి సమయం పడుతుంది. కాబట్టి, దాని సన్నాహాలు పూర్తి చేసిన తర్వాత, జనవరి 1, 2026 కి ముందు దీనిని అమలు చేయకూడదని కేంద్ర మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ సూచనలను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సమీక్షిస్తోంది. త్వరలో దానిపై నిర్ణయం తీసుకోవచ్చు. అదే సమయంలో, ప్రభుత్వం తన సూచనలపై, ఈ విషయానికి సంబంధించిన అన్ని వాటాదారులను ఆర్‌బిఐ సంప్రదిస్తుందని ఆశాభావం వ్యక్తం చేసింది. ఇది సామాన్య ప్రజల నుండి సూచనలను కూడా పొందుతుంది. కొత్త నిబంధనల ప్రకారం, వెండి ఆభరణాలు, నాణేలను తాకట్టు పెట్టడం ద్వారా కూడా రుణాలు తీసుకోవచ్చు. దీనికి కూడా ఆర్‌బిఐ ప్రమాణాలను నిర్దేశిస్తుంది. ఇది 925 స్వచ్ఛత వెండికి చెల్లుబాటు కావచ్చు. ఇది కాకుండా, బంగారు రుణం కోసం కస్టమర్‌తో సంతకం చేసే ఒప్పందంలో ప్రతి నియమం గురించి పూర్తి సమాచారం

# గుజరాత్ గుండె పగిలింది!

సాపోర్ట్స్

**ఇంటర్నెట్ డెస్క్:** ఐపీఎల్ 2025లో భాగంగా శుక్రవారం గుజరాత్ టైటాన్స్ ముంబయి ఇండియన్స్ మధ్య ఎలిమినేటర్ మ్యాచ్ జరిగింది. ఈ పోరులో మొదట బ్యాటింగ్ చేసిన ముంబయి 20 ఓవర్లకు 5 వికెట్లు నష్టపోయి 228 పరుగులు సాధించింది. ఛేదనలో గుజరాత్ నిర్ణీత ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 208 రన్స్ చేయగలిగింది. ఇలా కీలకమైన పోరులో 20 పరుగుల తేడాతో ఓటమి పాలై, ఇంటిముఖం పట్టింది. గుజరాత్ ఓటమిని జీర్ణించుకోలేకపోయిన అభిమానులు, ఆ జట్టు ఆటగాళ్ల కుటుంబసభ్యులు కన్నీటిపర్యంతమయ్యారు. మ్యాచ్ అనంతరం గుజరాత్ టైటాన్స్ కోచ్ అశిష్ నెహ్రా కుమారుడు స్టాండ్స్‌లో ఏడుస్తూ కనిపించాడు. అలాగే శుభ్‌మన్ గిల్ సోదరి కూడా కన్నీరు కార్చారు. ఈ మ్యాచ్‌లో మూడు క్యాచ్‌లను గుజరాత్ టైటాన్స్ ఆటగాళ్లు జారవిడిచారు. ఇవే వారిని విజయానికి దూరం చేశాయి. మూడు పరుగుల వద్ద రోహిత్ శర్మ ఇచ్చిన క్యాచ్‌ను గెరాల్డ్ కొయెట్జీ జారవిడిచాడు. తర్వాత 12 పరుగుల వద్ద హిట్‌మ్యాన్ ఇచ్చిన క్యాచ్‌ను కుశాల్ మెండిస్ కూడా ఒడిసి పట్టుకోలేకపోయాడు. ఈ తప్పిదాలు మ్యాచ్‌ను మలుపు తిప్పాయి. తనకు వచ్చిన లైఫ్‌లను సద్వినియోగం చేసుకున్న రోహిత్ 4 సిక్స్‌లు, 9 ఫోర్ల సాయంతో ఏకంగా 81 పరుగులు చేశాడు. సూర్యకుమార్ యాదవ్ ఇచ్చిన క్యాచ్‌ను కూడా మెండిస్ వదిలేశాడు. దీని తర్వాత మరో ఎనిమిది పరుగులు మాత్రమే జోడించి స్కై (33) పెవిలియన్ బాట పట్టాడు. చివర్లో హార్దిక్ పాండ్య విరుచుకుపడటంతో ముంబయి 228 పరుగులు చేయగలిగింది. 'ఇది నిజంగా అద్భుతమైన మ్యాచ్. నిజానికి మేం చక్కగానే ఆడాం. కానీ చివరి మూడు, నాలుగు ఓవర్లు మాకు మ్యాచ్‌ను దూరం చేశాయి. మూడు తేలికైన క్యాచ్‌లను వదిలేసి, మ్యాచ్ గెలవాలంటే అసాధ్యం. అలాంటి పరిస్థితుల్లో బ్యాటర్లను నియంత్రించడం బౌలర్లకు అంత తేలిక కాదు. మేం వారిని 210 పరుగులకు కట్టడి చేసి ఉంటే పరిస్థితి మరోలా ఉండేది. చివరి ఓవర్లోనూ మేం ఒకటి, రెండు సిక్స్‌లు తక్కువ ఇచ్చి ఉంటే బాగుండేది' అని మ్యాచ్ అనంతరం గుజరాత్ టైటాన్స్ సారథి శుభ్‌మన్‌గిల్ అన్నాడు



## బుమ్రా బౌలింగ్ కోటా పూర్తి కానంత వరకూ.. మ్యాచ్ ముగియనట్లే: ఏబీ డివిలియర్స్



**ఇంటర్నెట్ డెస్క్:** ఐపీఎల్ 2025లో భాగంగా ముంబయి ఇండియన్స్ గుజరాత్ టైటాన్స్ మధ్య శుక్రవారం ఎలిమినేటర్ మ్యాచ్ జరిగింది. ఈ పోరులో తొలుత బ్యాటింగ్ చేసిన ముంబయి, గుజరాత్ ముందు 228 పరుగుల లక్ష్యాన్ని ఉంచింది. ఛేజింగ్‌లో గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 208 పరుగులు మాత్రమే చేయగలిగింది. దీంతో ముంబయి ఇండియన్స్ 20 పరుగుల తేడాతో ఈ మ్యాచ్‌ను గెలిచింది. పంజాబ్ కింగ్స్‌తో క్వాలిఫయర్ 2 ఆడేందుకు అర్హత సాధించింది. పరాజయం పాలైన గుజరాత్ టైటాన్స్ ఐపీఎల్ టోర్నీ నుంచి నిష్క్రమించింది. ఈ మ్యాచ్‌లో జస్ప్రీత్ బుమ్రా కీలక సమయంలో వాషింగ్టన్ సుందర్‌ను తన అద్భుతమైన యార్కర్‌తో 48 పరుగుల వద్ద క్లీన్‌బౌల్డ్ చేశాడు. నాలుగో వికెట్‌కు సాయిసుదర్శన్‌తో కలిసి అతడు నెలకొల్పిన 84 పరుగుల భాగస్వామ్యానికి తెర దించాడు. ఇదే మ్యాచ్‌ను మలుపు తిప్పింది. ఈ విషయమై దక్షిణాఫ్రికా మాజీ క్రికెటర్ ఏబీ డివిలియర్స్ ఓ లైవ్ స్ట్రీమింగ్ ప్లాట్‌ఫాంతో మాట్లాడాడు. "బుమ్రాకు సరైన సమయంలో ముంబయి ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ బంతిని అందించాడు. సాయి సుదర్శన్ అతడి బౌలింగ్‌లో బాగా ఆడాడు. అందుకే బుమ్రాతో కాస్త ఆలస్యంగా బౌలింగ్ చేయించాడు. ఎప్పుడైతే జస్ప్రీత్ బుమ్రా తన కోటాలో మిగిలిన రెండు ఓవర్లు వేయడానికి వచ్చాడో.. అప్పుడే నా కుమారుడితో నేను.. 'అతడి బౌలింగ్ పూర్తయ్యేంత వరకు, ఈ మ్యాచ్ ముగియనట్లే' అన్నాను. తాను ఎందుకు అత్యుత్తమమో బుమ్రా ఈ మ్యాచ్‌లో మరోసారి నిరూపించుకున్నాడు' అని ఏబీ డివిలియర్స్ అన్నాడు. అలాగే ఈ సీజన్లో భీకర ఫామ్‌లో ఉన్న సాయిసుదర్శన్ వికెట్ కోల్పోవడంపై కూడా అతడు మాట్లాడాడు. 'రిచర్డ్ గ్లీసన్ బౌలింగ్‌లో 16వ ఓవర్లో సాయిసుదర్శన్ (80) పెవిలియన్ బాటపట్టాడు. ఇది కూడా మ్యాచ్‌కు మరో టర్నింగ్ పాయింట్. ఈ కీలకమైన మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్‌కు ఏదీ తమకు అనుకూలంగా జరగలేదు. వాళ్లు మూడు క్యాచ్‌లు డ్రాప్ చేశారు. కుశాల్ మెండిస్ హిట్ వికెట్‌గా వెనుదిరిగాడు' అని డివిలియర్స్ ముగించాడు.

## గంభీర్ సెలక్ట్ చేయడు.. రిజెక్ట్ మాత్రమే చేస్తాడు: అతుల్ వాసన్

**ఇంటర్నెట్ డెస్క్:** టీమ్‌ఇండియా జూన్ 20 నుంచి ఇంగ్లండ్‌లో పర్యటించనుంది. ఇందులోభాగంగా అయిదు టెస్టుమ్యాచ్‌ల సిరీస్ ఆడనుంది. ఈనేపథ్యంలో ఇటీవలే ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లనున్న భారత జట్టును బీసీసీఐ సెలక్టర్లు ప్రకటించారు. ఇందులో శ్రేయస్ అయ్యర్‌కు స్థానం దక్కలేదు. నిజానికి అతడు మంచి ఫామ్‌లో ఉన్నాడు. ప్రస్తుత ఐపీఎల్‌లోనూ చక్కగా రాణిస్తున్నాడు. అయినా జట్టులో చోటు దొరకలేదు. ఇదే విషయమై విలేకర్లు ప్రశ్నిస్తే బీసీసీఐ చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ అసలు కారణం ఏంటో వివరించే ప్రయత్నం చేశాడు. కానీ టీమ్‌ఇండియా కోచ్ గౌతమ్ గంభీర్ మాత్రం 'నేను సెలక్టర్‌ను కాదు..' అని జవాబిచ్చాడు. టీమ్‌ఇండియా మాజీ పేసర్ అతుల్ వాసన్ ఒక ఓటీటీ షోలో ఈ అంశం మీద మాట్లాడుతూ 'గంభీర్ సెలక్ట్ చేయడు.. కేవలం రిజెక్ట్ మాత్రమే చేస్తాడు' అంటూ చురకలంటించాడు. భారత జట్టు ఎంపికలో కోచ్‌కు కూడా కీలక పాత్ర ఉంటుందని వివరించాడు. శ్రేయస్ అయ్యర్‌ను టీమ్‌లోకి ఎందుకు తీసుకోలేదో అతడు వివరంగా చెప్పి ఉండాల్సిందని ఈసందర్భంగా అతుల్ వాసన్ అన్నాడు. శ్రేయస్ అయ్యర్‌ను ఎంపిక చేయకపోవడంపై పలువురు క్రీడాభిమానులు, విశ్లేషకులు ఆశ్చర్యం వ్యక్తంచేస్తున్నారు. మంచి ఫామ్‌లో ఉన్న అతడికి జట్టులో చోటు కల్పించకపోవడం సరైన నిర్ణయం కాదంటున్నారు.



Edited Printed Published & Owned by Dama VijayAKumar. And Printed at Vijay Publishers and Printers, #1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh.
Published at Vijay Publications, 1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. EDITOR DAMA VIJAYAKUMAR, RNI. NO. APTEL/2023/86143